
MAHANAGAR DINAPATRIKA

# మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 223 | పేజీలు : 8 | ఆదివారం 2 ఆగస్టు 2026 | వెల : 6-00








## స్వర్ణాంధ్ర విజన్‌కు
# శుభదినం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే
- రూ.18 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే
- మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయన్న మోదీ

2

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం

- సరికొత్త చరిత్రకు నాంది పలికాం
- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి

2



### ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్
## కొత్త అధ్యాయం

- మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
- దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస
- చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుంది
- ప్రధాని మోదీని విమర్శించడం తనను బాధించిందని వ్యాఖ్య

2



## క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి



- బాధిత కుటుంబాలను పరామర్శించని ప్రధాని
- విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని వ్యాఖ్య
- తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది

5



## నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

- నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

5



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం
- వేదాలు, రామాయణ, మహాభారతాల్లోనే మధ్యవర్తిత్వ సూత్రాలున్నాయని వెల్లడి

5

### ప్రమాదకర స్థాయిలో
# గోదావరి ప్రవాహం



- అంతకంతకూ పెరుగుతున్న ప్రవాహం
- రాజమహేంద్రవరం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి ఉధృతి
- 175 గేట్లు ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగా వదులుతున్న అధికారులు
- వరద ఉధృతితో పలు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు

**అమరావతి, మహానగర్**

రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువన రాష్ట్రాలతో పాటు, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 13 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం 11.46 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు దిగువకు ప్రవహిస్తుండగా అంతకంతకూ పెరుగుతోంది. భద్రాచలం నుంచి భారీగా వరద - మిగతా5లో



### వేగవంతమైన ప్రయాణానికి
# సరికొత్త బాట

- ప్రారంభానికి సిద్ధమైన 'ఖమ్మం-దేవరపల్లి' హైవే
- హైదరాబాద్-విశాఖ మధ్య తగ్గనున్న 56 కి.మీ. దూరం
- నిర్మాణ పనులన్నీ పూర్తి చేసిన ఎన్‌హెచ్ఏఐ
- తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి

**అమరావతి, మహానగర్**

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైటెక్ హైవే పనులు పూర్తి అయ్యాయి. ప్రారంభానికి సిద్ధమైన ఈ హైవేపై వాహనాల రాకపోకలకు పూర్తి స్థాయిలో అనుమతి ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్– విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఈ హైవే తెలంగాణలో ఖమ్మం జిల్లా తల్లంపాడు - మిగతా2లో

## స్వర్ణాంధ్ర విజన్‌కు శుభదినం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి ఇవాళ అత్యంత కీలకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రంలో మొత్తంగా రూ. 18 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన ప్రకటించారు. ఉత్తరాంధ్ర యువత ప్రగతికి ఈ సరికొత్త ఎయిర్ పోర్టు ఒక రన్‌వేలా, లాంచ్ ప్యాడ్‌లా పని చేస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్రతో పాటు వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజిన్ సర్కార్ రాత్రింబవళ్లు శ్రమిస్తోందని వెల్లడించారు. ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవాలను స్మరిస్తూ ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోదీ, గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలపై ఆయన పేరుతోనే ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కేవలం ఒకే కుటుంబం పేర్లు ఎయిర్ పోర్టులకు పెట్టే పద్ధతిని మార్చి, దేశ సంస్కృతిని గౌరవిస్తూ అయోధ్యలో వాల్మీకి పేరు, ఇక్కడ అల్లూరి పేరు పెట్టామని గుర్తుచేశారు. దేశంలో గతంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్యను 166కు పెంచడం ద్వారా చిన్న చిన్న పట్టణాలకూ విమానయాన సేవలను విస్తరించామన్నారు. ఉడాన్ పథకం ద్వారా సామాన్యుడికి కూడా విమానం ఎక్కే అవకాశం లభించిందని, స్మోక్ ఎయిర్ పోర్టు మోడల్ ద్వారా ఏకంగా 25 దేశాలకు ఎయిర్ కనెక్టివిటీ సాధ్యమైందని కొనియాడారు. ఇదే సభలో ఏపీకి చెందిన 13 వేల మందికి పైగా గిరిజన మహిళలు థింసా నృత్యంతో గిన్నిస్ రికార్డు సృష్టించడం అభినందనీయమని ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెండింతల వేగంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో కోస్టల్ ఎకానమిక్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తూ బ్లూ ఎకానమీని బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగానే విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న పాత రేవులను ఆధునీకరిస్తూనే, మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా వేగాన్ని పెంచేందుకు విశాఖ–రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను శరవేగంగా విస్తరిస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించేలా రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో రైల్వే కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగానే 70కు పైగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని వివరించారు. పీఎం గతి శక్తి–మాస్టర్ ప్లాన్ ద్వారా రైలు, పోర్టు, ఎయిర్ పోర్టులను ఒకేతాటిపైకి తెచ్చి సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఆధునిక లాజిస్టిక్ నెట్‌వర్క్ భవిష్యత్తులో దేశంలోని రైతులకు, పారిశ్రామికవేత్తలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ యువతకు సాఫ్ట్‌వేర్, ఐటీ మరియు సాంకేతిక రంగాలలో అద్భుతమైన నైపుణ్యం ఉందని, అందుకే విశాఖలో సెమీకండక్టర్ లాంటి ఫ్యూచరిస్టిక్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని ప్రధాని తెలిపారు. సీఎం చంద్రబాబు పగలు, రాత్రి కష్టపడి చేస్తున్న కృషి వల్లే ఏపీకి గూగుల్ డేటా సెంటర్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో తరలివస్తున్నాయన్నారు. ఏపీలో సెమీకండక్టర్ పరిశ్రమతో పాటు ఏఐ ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు ఏర్పాటు కావడం ద్వారా ఇక్కడి యువతకు స్థానికంగానే భారీగా ఉపాధి లభించబోతోందని స్పష్టం చేశారు. నక్కపల్లిలో కేంద్రం ఏర్పాటు చేయనున్న అతి పెద్ద ఫార్మా పార్క్ ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రముఖ ఫార్మా హబ్‌గా మారనుందని వెల్లడించారు. రాయలసీమ ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, గత మూడేళ్ల పర్యటనల్లోనే ఏపీలో రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఆసియా ఖండంలోనే విశాఖ ఎకనమిక్ రీజియన్ అత్యంత కీలకమైన పారిశ్రామిక కేంద్రంగా మారబోతోందని, అందుకు తగ్గట్లుగా కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోందని ప్రకటించారు.

పరిశ్రమల ద్వారా పెట్టుబడులు పెరగడం, తద్వారా ఉత్పత్తి, ఎగుమతులు పెరిగి యువతకు ఉపాధి లభించడమే ఎన్డీఏ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పెట్టుబడుల ద్వారా ప్రజల జీవితాలను మార్చడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాయని వివరించారు. ఇవాళ ఏపీలో ప్రారంభించుకున్న ప్రాజెక్టులన్నీ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపి, స్వర్ణాంధ్ర–వికసిత్ భారత్ సంకల్పాన్ని వంద శాతం నెరవేరుస్తాయని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

## ఫుల్ రేంజ్ లో లోకేష్ పాలిటిక్స్

విజయవాడ

మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయాలను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసుకుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది.=పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ం. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది. దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# వేగవంతమైన ప్రయాణానికి సరికొత్త బాట

-మొదటిపేజీ తరువాయి

నుంచి ప్రారంభమై ఏపీలో రాజమండ్రి సమీపంలోని దేవరపల్లి వద్ద ముగుస్తుంది. సుమారు 165 కిలోమీటర్ల ఈ రహదారిని నిర్మించారు. హైదరాబాద్–విశాఖపట్నం మధ్య రాకపోకలకు ఇక విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా 56కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ప్రయాణించిన దూరానికే టోల్ వసూలు సహా వేగంగా వెళితే ఏఐ ద్వారా చలాన్లు విధించడం ఈ హైవే ప్రత్యేకత. తెలుగు రాష్ట్రాల్లో తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా ఇదే. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేసే మణిహారం పూర్తి స్థాయిలో సిద్ధమైంది. తెలంగాణలోని ఖమ్మం– ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి మధ్య 165కిలోమీటర్ల మేర నిర్మించిన తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలో ప్రారంభం కానుంది. ఖమ్మం నుంచి పారంభమయ్యే ఈ రహదారి ఆంధ్రాలో ఏలూరు జిల్లా చింతలపూడి మండలం లింగగూడెం వద్ద ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రేచర్ల, టి.నరసాపురం, ఏపిగుంట, గురవాయిగూడెం, రాజవరం, పొంగుటూరు, యర్రంపేట మీదుగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిలో కలుస్తుంది. ఖమ్మం–దేవరపల్లి మధ్య 8 టోల్‌ప్లాజాలు, 51 మైనర్, 9 మేజర్ వంతెనలు ఉన్నాయి. తెలంగాణలో 90 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్?లో 75 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గ్రీన్ ఫీల్డ్ హైవే పరిధిలో తెలంగాణలో 8 చోట్ల ఎంట్రీ, ఏపీలో 4 చోట్ల ఎగ్జిట్ పాయింట్లను నిర్మించారు. 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఖమ్మం–దేవరపల్లి రహదారిని 3వేల 573 కోట్ల రూపాయలతో నిర్మించారు. ఈ హైవే అనేక ప్రత్యేకతల సమాహారం. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల ఆధారంగా హైవేపై ప్రయాణించిన దూరానికే టోల్‌ట్యాక్స్ వసూలు చేయనున్నారు. ఏడాది పాసు తీసుకునే అవకాశం కూడా ఉంది. 5 ప్రాంతాల్లో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏటీఎమ్?లను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఎక్కడైనా ప్రమాదం జరిగినా, వాహనదారులు మితిమీరిన వేగంతో నడిపినా, సీటు బెల్టు పెట్టుకోకున్నా, రాంగ్ రూట్‌లో వచ్చినా సమాచారం అందుతుంది. వెంటనే అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు. నిబంధనలను అతిక్రమించిన వారికి చలాన్లు పంపిస్తారు. ఇదంతా ఏఐ ఆధారంగా జరుగుతుంది.

సాధారణ జాతీయ రహదారుల్లా కాకుండా కొత్త రహదారిపై కేవలం 9 చోట్ల మాత్రమే అంటే సుమారు 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. ప్రమాదాలు, అత్యవసర సందర్భాల్లో బాధితులను తరలించడానికి ప్రతి 5 కిలో మీటర్లకు ఒక ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్–రాజమండ్రి,



విశాఖపట్నం మధ్య రాకపోకలకు ఇక విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా 56కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఇది తెలుగు రాష్ట్రాల్లో తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. ప్రయాణికులు సేద తీరడానికి సౌకర్యాలు ఖమ్మం–దేవరపల్లి రహదారిపై ప్రతి 2 కి.మీర్లకు 360 డిగ్రీల కోణంలో పనిచేసే సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అలాగే, సోలార్ ఆధారిత దీపాలు ఏర్పాటు చేశారు. ప్రతి 50 కిలోమీటర్లకు రోడ్డుకు 2 వైపులా అయిదు ఎకరాల్లో ప్రయాణికులు సేద తీరడానికి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్స్ ఉంటాయి.

రహదారిపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డులను స్కాన్ చేయడం ద్వారా మనం ఏ ప్రాంతంలో ఉన్నాం, దగ్గరలోని పోలీసు స్టేషన్, పెట్రోల్‌బంకులు తదితర సమాచారం తెలుస్తుంది. నివాసాలకు దూరంగా పచ్చని పంట పొలాల మధ్య నుంచి సాగే ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది. భూమి నుంచి కొంత ఎత్తులోనే ఈ హైవే నిర్మాణం సాగింది. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. కర్బన ఉద్గారాల నివారణకు నిర్మాణంలో రామగుండం ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ తెచ్చి వినియోగించారు.

ఖమ్మం నుంచి సూర్యాపేట వరకు జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది. ఇప్పటికే వైరా నుంచి దేవరపల్లి వరకు వాహనాలను అనుమతిస్తున్నారు. భారత్ మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద ఎన్ హెచ్ 365బీజీ పేరిట ఈ జాతీయ హరిత మార్గం నిర్మితమైంది. ఖమ్మం జిల్లా గ్రామీణం మండలంలోని తల్లంపాడు నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు తెలంగాణలో మూడు ప్యాకేజీలుగా, ఏపీలో రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు పూర్తి చేశారు. ప్యాకేజీ ఒకటిలోని ధంసలాపురం వద్ద రైల్వే పై వంతెన కూడా సిద్ధంగా ఉంది. రహదారి నిర్మాణంలో కీలకమైన ఈ వంతెన రైల్వే ట్రాక్‌పై వంపు తిరిగినట్లు ఉంటుంది.

**మంత్రి తుమ్మల పర్యవేక్షణలో**

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రహదారిపై 100 కిలోమీటర్లు ప్రయాణించి పురోగతిని పరిశీలించారు. పనులపై పలుమార్లు సమీక్ష నిర్వహించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే దీని వెంట ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి ఊపందుకోవడం సహా అనేక ప్రయోజనాలు కల్గనున్నాయని తుమ్మల తెలిపారు.

ఖమ్మం–దేవరపల్లి ప్రాజెక్టుకు 2017లో ప్రతిపాదనలు రూపొందించారు. 2018లో ఆమోదం లభించింది. అప్పటి నుంచి పనులు ఎలాంటి ఆటంకం లేకుండా సాగాయి. చిన్న చిన్న సమస్యలు వచ్చినా అధికారులు వాటిని అధిగమించి పనులు పూర్తి చేశారు. రెండు రాష్ట్రాల్లోనూ నిర్మాణాలను పరుగులు పెట్టించారు. రాత్రి పగలు పని చేస్తూ పనులను కొలిక్కి తెచ్చారు. రహదారులను దేశ ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా పేర్కొంటారు. ప్రజల ప్రయాణాలు, సరుకు రవాణా సాఫీగా సాగాలంటే రహదారులు బాగుంటేనే సాధ్యం. ఈ నేపథ్యంలో అన్ని హంగులతో సిద్ధమైన ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రయాణికుల ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు సమయం, డబ?బు ఆదా కానుంది. హైదరాబాద్–రాజమండ్రి, విశాఖపట్నం మధ్య ఎలాంటి ఆటంకాలు లేకుండా వాహనాలు రయ్ రయ్‌మని దూసుకుపోనున్నాయి.

# వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు

కర్నూలు

రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది.హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఆధునిక ఆవిష్కరణలతో అనుసంధానిస్తూ ముందడుగు వేయాలి





- వారసత్వ పరిరక్షణలో యువతదే కీలక పాత్ర
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- సప్తసింధు 2026-సృజనాత్మక సంగమం
- సంస్కృతి, వారసత్వం, వాస్తుశిల్పం.. ఒకే వేదిక పైకి..

విజయవాడ, మహానగర్

భారతీయ సంస్కృతి, వారసత్వం, వాస్తుశిల్ప సంపద పరిరక్షణతో పాటు వాటిని భావితరాలకు చేరవేయడంలో యువతదే కీలక పాత్ర అని.. ఇందుకు దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ఆధునిక ఆవిష్కరణలతో అనుసంధానిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏఈ ఫౌండేషన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (విజయవాడ), విశ్వ బంధు ట్రస్ట్, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంయుక్త భాగస్వామ్యంతో శనివారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ)లో సప్త సింధు--2026: అమరావతి ఎడిషన్ ప్రారంభమైంది. సప్త నదుల విశిష్టత స్ఫూర్తితో దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు, అధ్యాపకులు, వాస్తుశిల్పులు, కళాకారులు, పరిశోధకులు, సాంస్కృతిక రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి నవ ఆలోచనల మేధోమథనం, సృజనాత్మకత, వారసత్వ పరిరక్షణకు ప్రోత్సాహం ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు జరగనుంది. యువత సృజనాత్మకతను ప్రోత్సహించే ప్రత్యేక కార్యక్రమాలు, టెంపుల్ ఆర్కిటెక్చర్ పోటీలకు ఇది వేదికగా నిలిచింది. ఏఈ ఫౌండేషన్ డైరెక్టర్ సంగీత మిశ్రా, ఎస్‌పీఏ (విజయవాడ) డైరెక్టర్ డా. రమేష్ శ్రీకొండ, విశ్వబంధు ట్రస్ట్ ఫౌండర్ యమునా పాఠక్, ఐజీఎన్‌సీఏ రీజనల్ సెంటర్ - తిరుపతి రీజనల్ డైరెక్టర్ డా. కేటీవీ రాఘవన్ తదితరుల భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమం యువత సృజనకు కొత్త ఊపు తెచ్చింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రత్యేక అతిథిగా హాజరై విద్యార్థుల ఆర్కిటెక్చర్ కళా వైభవానికి ప్రతికలుగా నిలిచిన డిజైన్లను పరిశీలించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువ వాస్తుశిల్పులు, అధ్యాపకులు, కళాకారులు, పరిశోధకులు పరస్పర అనుభవాలను పంచుకోవడం ద్వారా కొత్త ఆలోచనలు, సృజనాత్మక దృక్పథాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. వాస్తుశిల్పం, వారసత్వ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి వంటి అంశాల్లో యువత సృజనాత్మకత దేశ భవిష్యత్తుకు దోహదపడుతుందని చెప్పారు. సప్త సింధు--2026.. కేవలం ఒక సదస్సు మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, వారసత్వం, వాస్తుశిల్పం, విద్య, యువత సృజనాత్మకతను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఓ గొప్ప వేదిక అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

# ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు





- పేదల సామాజిక భద్రతకు ఎన్టీఆర్ భరోసా
- జిల్లాలో 2,24,793 మంది లబ్ధిదారులకు రూ. 98.12 కోట్లు
- పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు

విజయవాడ, మహానగర్

స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు అనుగుణంగా పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల ఫలాలను అర్హుల ఇంటివద్దకే అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం ఆటోనగర్ సమీపంలోని జేడీ నగర్‌లో జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం అమల్లో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 2,24,793 మంది లబ్ధిదారులకు రూ. 98.12 కోట్ల మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇంటిదగ్గరే పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. పంపిణీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు

**మహిళల ఆర్థిక సాధికారతకు వినూత్న మార్గాలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ఇబ్రహీంపట్నం, మహానగర్

పోషకాహార ఉత్పత్తులు, విలువ ఆధారిత ఆహార పదార్థాల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో మహిళలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, మహిళల ఆర్థిక సాధికారతకు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా-రైజ్.. నేటివ్ టేబుల్, ఫిక్కీ ఎఫ్ఎల్‌వో విజయవాడ సంస్థల భాగస్వామ్యంతో ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం స్వయం సహాయక సంఘ మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. పోషకాలు మెండుగా ఉండే బ్రౌన్ గుడ్ల ఉత్పత్తి విధివిధానాలపై అవగాహన కల్పించారు. సహజ సిద్ధమైన పద్ధతుల్లో కోళ్ల పెంపకం చేపట్టడం, పోషకాలతో కూడిన గుడ్ల ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలను వివరించారు. యాంటీబయోటిక్స్‌ను ఉపయోగించకుండా కేవలం సహజమైన మేత, ఉన్నతమైన పోషకాలతో కోళ్లను ఎలా పెంచాలో వివరించారు. ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు, రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలకు నెలవైన గుడ్ల ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సహజసిద్ధంగా పండించే ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు శరీరానికి అవసరమైన పోషకాలను సమృద్ధిగా అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో పోషకాహారానికి పెద్ద అండ అయిన గుడ్లను సమృద్ధిగా విటమిన్ డి, బీ12తో మరింత పోషకాల గనిగా మార్చేందుకు నేటివ్ టేబుల్ కృషిచేస్తోందన్నారు. సహజ ఆహార ఉత్పత్తులతో సుస్థిర ఆదాయం సమకూరడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌కు అందించడం ద్వారా మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, సుమబిందు అట్లూరి (ప్రమాణ్ పౌల్ట్రీస్), నేటివ్ టేబుల్ మేనేజింగ్ పార్టనర్ చరిత మూల్పూరి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రాజెక్టులే అభివృద్ధికి కీలకం

**8 ఆర్వోబీలు, అమృత్ భారత్ ప్రాజెక్టుల కోసం కేంద్రాన్ని కోరతాం**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**సౌత్ కోస్టల్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ మాథుర్‌తో భేటీ**

విజయవాడ, మహానగర్



నగరంలో రైల్వే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నగరాన్ని దేశంలోనే ఆదర్శ రైల్వే కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో కృషి చేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ మాథుర్‌ను కలిసి విజయవాడతో పాటు పరిసర ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక రైల్వే సమస్యలను ఆయన వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ చిన్ని, నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎనిమిది రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్వోబీలు) నిర్మాణంపై జీఎంతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఎర్రకట్ట వంతెన పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత కీలకమని, గుణదల ఎల్‌సీ-8 వద్ద ఆర్వోబీ నిర్మాణం కూడా అత్యవసరమని స్పష్టం చేసినట్లు చెప్పారు. విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు టెండర్లు పిలిచినా స్పందన రాకపోవడం ఆందోళనకరమని పేర్కొన్న ఆయన, ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కేంద్ర రైల్వే శాఖతో ప్రత్యేకంగా చర్చిస్తామని తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మరింత అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని రాష్ట్ర ఎంపీలంతా కలిసి కోరనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ--బెంగళూరు (గుత్తి మీదుగా) కొత్త రైలు సేవ ప్రారంభించాలని, కొండపల్లి రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలని జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ తెలిపారు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రైల్వే స్టేషన్లలో విజయవాడ ఒకటని, దేశంలోని నలుమూలలను కలిపే కీలక రైల్వే జంక్షన్‌గా ఇది అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. విజయవాడ అభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు కీలకమని, నగరానికి అవసరమైన ప్రతి రైల్వే ప్రాజెక్టును కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు.

# యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియాతో వివెన్స్ గ్రూప్ వ్యూహాత్మక భాగస్వామ్యం

విజయవాడ

ఆస్ట్రేలియాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూప్‌తో కలిసి విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, వృత్తిపరమైన అభివృద్ధి, పరిశ్రమల సహకార రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టేందుకు ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, శిక్షణ శాఖ సహాయ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు జూలియన్ హిల్ స్వయంగా విజయవాడకు రావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయవాడలోని నోవోటెల్ వరుణ్ హోటల్‌లో శనివారం నిర్వహించిన స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, శిక్షణ శాఖ సహాయ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు జూలియన్ హిల్, విద్య, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల ఆధారంగా ఆస్ట్రేలియా--భారత్ భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూప్ మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. భారతదేశంలో యూడబ్ల్యూఏ చేస్తున్న పెట్టుబడులు, వివెన్స్ గ్రూప్‌తో కలిసి చేపడుతున్న కార్యక్రమాలు రెండు దేశాల మధ్య సంబంధాలకు కొత్త దిశను చూపుతాయని అన్నారు. వివెన్స్ గ్రూప్ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు అర్జున్ సురపనేని మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి విద్యా, పరిశోధన, ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యంతో ఈ అవగాహన ఒప్పందం కుదిరిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల విద్యను స్థానిక అవసరాలకు అనుగుణంగా అందిస్తూ, భవిష్యత్తు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశమని వివరించారు. యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూప్ విద్య, పరిశోధన, వృత్తిపరమైన అభివృద్ధి, సామర్థ్యాభివృద్ధి, పరిశ్రమల సహకారం వంటి రంగాల్లో ఐదేళ్లపాటు కలిసి పనిచేయడానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఆరోగ్యం, ముఖ్యంగా ఆడియాలజీ, పునరుత్పాదక ఇంధనం, కృత్రిమ మేధస్సు, క్వాంటం టెక్నాలజీ, సైబర్ భద్రత, బయోడిజైన్ వంటి రంగాల్లో సంయుక్త కార్యక్రమాలు చేపట్టనున్నాయి.









భారతదేశంలో యూడబ్ల్యూఏ అమలు చేస్తున్న హబ్-అండ్-స్పోక్ నమూనాలో భాగంగా ముంబై, చెన్నై నగరాల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. వివెన్స్ గ్రూప్‌తో ఏర్పడిన ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విద్య, పరిశోధన, పరిశ్రమల సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. ప్రపంచ స్థాయి విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయి. గత 46 సంవత్సరాలుగా భారతదేశంతో అనుబంధాన్ని కొనసాగిస్తున్న యూడబ్ల్యూఏ, భారత జాతీయ విద్యా విధానం కింద ముంబై, చెన్నై నగరాల్లో పూర్తిస్థాయి యూనివర్సిటీ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తోంది. ఈ భాగస్వామ్యం వెస్టన్ ఆస్ట్రేలియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఉన్న సుస్థిర సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సలహాదారు రవి వేమూరు, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా డిప్యూటీ వైస్-చాన్సలర్ (గ్లోబల్ ఎంగేజ్‌మెంట్) ప్రొఫెసర్ జెన్నిఫర్ హోవెల్, హెచ్‌సీఎల్ టెక్ సీనియర్ క్యాపబిలిటీ లీడర్ సురేష్ బాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూప్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఈ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించనుందని ఇరు సంస్థలు విశ్వాసం వ్యక్తం చేశాయి.

# సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం.2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి



రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది. మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటు న్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయి జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుం టుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

# ఎన్డీయేకు ముందున్నది ముసళ్ల పండుగ!



నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులు ఇటీవల కొన్ని రోజులపాటు నిర్వహించిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సీజేపీ ఆందోళన దేశంలోని వాస్తవ స్థితిగతులను ప్రతిబింబించింది. ఒక్క ప్రశ్నపత్రాల లీకేజీనే కాదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, అప్పులు, రూపాయి క్షీణత వంటివి ఎన్డీయే పాలనపై విద్యార్థులు, యువత, ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని బహిర్గతం చేశాయి. ఎన్డీయే అధికారంలో ఉన్న ఈ 12 ఏండ్లలో దేశం పురోగమనం చెందిందని బీజేపీ, దాని మిత్రపక్షాలు డప్పు కొట్టుకుంటున్నాయి. కానీ, దేశంలోని ఏ వర్గంలోనూ సంతృప్తి లేదు. పేదరికం ఆనవాళ్లు పోలేదు. విదేశాల్లో దాచిపెట్టిన నల్లధనాన్ని భారతదేశానికి తెప్పించి ప్రతి ఒక్కరి బ్యాంక్ అకౌంట్‌లో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని నమ్మించిన ఎన్డీయే ఆ తర్వాత మొండిచేయి చూపింది. దేశంలో నిరుద్యోగమే ప్రధాన సమస్యగా ఉన్నది. అది యేటేటా పెరుగుతూ ప్రస్తుతం 16 శాతానికి చేరింది. యేటా విద్యావంతులు, పట్టభద్రులు, పీజీ, పీహెచ్‌డీల సంఖ్య పెరుగుతున్నా వారికి ఉద్యోగాలు, ఉపాధి గగనంగా మారాయి. దేశంలో చదువుకు తగిన ఉద్యోగం చేస్తున్న పట్టభద్రులు కేవలం 8.25 శాతం మంది మాత్రమే. కేంద్రం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం కావడంతో దేశంలో 22 కోట్ల మంది పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. సాధారణ పట్టభద్రుల్లో 84 శాతం మంది, ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ప్రతి 10 మందిలో 8 మందికి కొలువులు రావట్లేదు. యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ సర్కార్ ఇచ్చిన హామీ బూటకంగా మిగిలిపోయింది. విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరగడం లేదు. నిత్యం విద్యార్థుల ఆత్మహత్యలు, ర్యాగింగ్‌లు, వేధింపులు జరుగుతున్నాయి. ఉపాధి ఆధారిత విద్యావిధానం అమలుపై దృష్టి సారించడం లేదు. మతం పేరిట భావోద్వేగాలను రెచ్చగొట్టి విద్యార్థులకు సైతం పావులుగా వాడుకుంటున్నది తప్ప వారి జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చేందుకు ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. నిత్యావసరాల ధరల మీద నియంత్రణ లేదు. బియ్యం, పాలు, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, ఇతర వినియోగ వస్తువుల ధరలు 12 ఏండ్లలో 40 శాతం నుంచి 400 శాతం వరకు పెరిగాయి. వంటగ్యాస్, చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో పెట్రో ధరలు పెంచడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తున్నది. 120 ప్రభుత్వరంగ సంస్థలను అతి తక్కువ ధరకే బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. రైతాంగం పరిస్థితి దయనీయ స్థితికి చేరుకున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయి. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. నిత్యం రైతాంగం ఆందోళన చేస్తుంటే వారిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నదే తప్ప సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. పేదలు, రైతులకు రుణమాఫీకి వ్యతిరేకమని చెప్పిన కేంద్రం పెద్ద పెద్ద కంపెనీలకు రుణ రాయితీలిచ్చి ఇచ్చి వాటిపై ప్రేమను చాటుకుంటున్నది. 2024లో 10,546 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 67 ఏండ్లు పాలించిన ప్రభుత్వాలు రూ.55 కోట్ల లక్షల అప్పు చేస్తే ఎన్డీయే సర్కార్ ఇప్పటికే రూ.155 లక్షల కోట్లు అప్పు చేసింది. అంటే దేశంలో ప్రతి ఒక్కరిపైనా అప్పు లక్షా ఇరవై వేలకు చేరింది. పెద్ద నోట్ల రద్దు వల్ల భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురికాగా, బడాబాబులు కుబేరులయ్యారు. భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా)ని విశ్వవ్యాప్తంగా చేస్తామని బీజేపీ చెప్పగా చివరికి విదేశాల నుంచి దిగుమతులు పెంచింది. దేశ రైతాంగాన్ని, పారిశ్రామికరంగాన్ని దెబ్బతీసేలా అమెరికా, బ్రిటన్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది.నైతిక విలువలకు తిలోదకాల్చి రాజకీయ పార్టీలను చీల్చడం, బలహీనపరచడం, ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోస్తున్నది. తమ మాట వినని ప్రతిపక్ష పార్టీల నేతలను వివిధ స్కామ్‌లలో ఇరికించి జైలుపాలు చేయడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖలు రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగపడుతున్నాయి. ఈడీ ఇప్పటివరకు 121 కేసులు నమోదు చేయగా 95 శాతం విపక్ష నాయకులపై మనీ లాండరింగ్ చట్టం కింద పెట్టిన కేసులు 5,420. అందులో 5,150 కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలపై 149 రాజద్రోహం కేసులు నమోదయ్యాయి. విద్యావ్యవస్థ మరింత దెబ్బతిన్నది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనదేశం ర్యాంకు యేటేటా తగ్గుతున్నది. 2014లో మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఆయా ఘటనల్లో 360 మంది వరకు సైనికులు, పోలీసులు అమరులయ్యారు. 230 మంది పౌరులు మృతి చెందారు. 2014 నుంచి ఇప్పటివరకూ ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. 2016లో జరిగిన 'ఉరి' ఉగ్రదాడి, 2019లో జరిగిన 'పుల్వామా' దాడి, గత యేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడి, ఎర్రకోట దగ్గర కారు పేలుడుతో యావత్తు దేశం వణికిపోయింది. మన విదేశాంగ విధానం సరిగా లేదు. సమయస్ఫూర్తి లోపించడం వల్ల అనేక దేశాలతో అంతరం క్రమేణా పెరుగుతున్నది. దిగుమతులపై ఆధారపడిన దేశానికి ఈ విధానాలు సమస్యగా మారి సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. అధికారపక్షాన్ని నిలదీసి ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవాల్సిన గురుతర బాధ్యత విపక్షాలకే ఉంటుంది. కానీ ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఆ దిశగా ఎదగడం లేదు. పోరాటపంథా లోపించి ఎన్డీయేను ఢీకొట్టడంలో అది విఫలమవుతున్నది. 2024 ఎన్నికల సందర్భంగా విపక్షాల బలం పెరిగినా దానిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి. అన్ని విపక్షాలను ఏకం చేసి ఎదుర్కొనే అవకాశం ఉన్నా అలాంటి చొరవ కాంగ్రెస్‌లో లోపిస్తున్నది. దేశంలో అత్యధిక విపక్ష ఎంపీలున్న డీఎంకే వంటి పార్టీని వీడి, అధికారంలో పాలుపంచుకోవడానికి తమిళనాడులో విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీతో చేతులు కలుపడం ఆ పార్టీ వ్యూహరాహిత్యాన్ని బహిర్గతం చేసింది. కాంగ్రెస్‌లో సమర్థులున్నా వారి సేవలను ఆ పార్టీ వినియోగించుకోలేక రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపైనే ఆధారపడుతున్నది. మరోవైపు దేశంలోని మీడియాను ఎన్డీయే ప్రభుత్వం గుప్పిట్లోకి తీసుకొంటున్నది. విపక్షాలు విఫలమైనపుడు ఆ పాత్ర పోషించాల్సిన మీడియా ప్రేక్షకపాత్ర, అధికారపక్షానికి వంతపాడటానికే ప్రాధాన్యం ఇస్తున్నది. జంతర్ మంతర్‌లో సీజేపీ ఆందోళన సందర్భంగా మీడియా వైఖరిపై విద్యార్థులు, యువత ఆగ్రహం ప్రదర్శిం చారు. సీజేపీ ఆందోళన ఎన్డీయే ప్రభుత్వానికి గుణపాఠమైంది. కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు, మీడియాకు సైతం కనువిప్పు కలిగించింది. దేశంలోని విద్యార్థి, యువత, రైతులు, అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచింది. ప్రజాస్వా మ్యంలో ప్రతిపక్షాలు నిర్వీర్యమైనా, మీడియా అధికారపక్షానికి కొమ్ముకాసినా ఆ పాత్రను వారే పోషిస్తారనే సత్యాన్ని వెల్లడిం చింది. ఇది మున్ముందు పెనుమార్పులకు దారితీస్తుంది. సామదానభేద దండోపాయాలతో వ్యవహరిస్తున్న కేంద్రం ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరింత ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. మీడియా సైతం తన ధోరణిని మార్చుకోవాలి. ప్రజల కోణంలో ఆలోచించి నడుచుకోవాలి. విద్యావ్యవస్థ మరింత దెబ్బతిన్నది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనదేశం ర్యాంకు యేటేటా తగ్గుతున్నది. 2014లో మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఆయా ఘటనల్లో 360 మంది వరకు సైనికులు, పోలీసులు అమరులయ్యారు. 230 మంది పౌరులు మృతి చెందారు.

# సంస్కరణలు కాదు ప్రత్యామ్నాయం కావాలి



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా భారత విద్యార్థి ఉద్యమానికి ఒక ము ఖ్యమైన రాజకీయ విజయం. అయితే ఆయన రాజీనామా లేఖలో ఒక పెద్ద వైరుధ్యం కనిపిస్తున్నది. పరిపాలనా వైఫల్యాన్ని అంగీకరించిన చర్యగా కాకుండా, విద్యార్థుల ప్రయోజనాల కోసం, దేశ ఐక్యతను కాపాడేందుకు తీసుకున్న రాజకీయ, నైతిక నిర్ణయంగా తన రాజీనామాను చిత్రీకరించారు. అంటే బాధ్యతను అంగీకరించే బదులు, తాను బాధితుడిననే భావనను ముందుకు తెచ్చారు. ఇపుడు సమస్య ఒక మంత్రి గురించో, ఒక ప్రశ్నాపత్రం లీక్ గురించో కాదు. మన విద్యావ్యవస్థ క్రమంగా కేంద్రీకృతమై, వ్యాపారీకరణ చెంది, విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని మోపే విధంగా మారిపోయిందనే విషయాన్ని విద్యార్థి ఉద్యమం ఎత్తిచూపుతున్నది ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డిజిటల్ పరీక్షలను మరింత భద్రంగా నిర్వహించడం, ప్రశ్నాపత్రాల లీకులను అరికట్టడం దీని లక్ష్యం. అయితే, సాంకేతిక భద్రతను మెరుగుపరచడం అవసరమే. కానీ ఇవి పైపై సంస్కరణలు మాత్రమే, సమస్య మూలాలను ఏమాత్రం పరిష్కరించలేవు. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం కొన్నేండ్లుగా చేస్తున్న వాదనను తెలుసుకోవాలి. నీట్ విధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేస్తుందని వాదిస్తున్నది. పన్నెండో తరగతి విద్యను పక్కనబెట్టి, ఒకే పరీక్ష ఆధారంగా వైద్య విద్యలో ప్రవేశాలు ఇవ్వడం విద్యలో సమాన అవకాశాల సూత్రానికి విరుద్ధమని పేర్కొంటున్నది. జస్టిస్ ఏకే రాజన్ కమిటీ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పింది. దేశమంతటా ప్రవేశాలను ఒకే సంస్థ నియంత్రించినపుడు, ఒక చిన్న సాంకేతిక లోపం, ఒక ప్రశ్నాపత్రం లీక్ లేదా ఒక పరిపాలనా పొరపాటు కూడా జాతీయ స్థాయి సంక్షోభంగా మారుతుంది. అధిక కేంద్రీకరణ ప్రమాదాలను తగ్గించలేదు. వాటిని మరింత పెంచుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాటైనపుడే ప్రగతిశీల విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే హెచ్చరించాయి. అన్ని పరీక్షలను ఒకే సంస్థ చేతిలో పెట్టడం వల్ల సమాఖ్య వ్యవస్థ బలహీనపడుతుందని, మొత్తం ప్రవేశ ప్రక్రియ వ్యవస్థాగత వైఫల్యాలకు గురవుతుందని వారు స్పష్టం చేశారు. ఇపుడు వారి హెచ్చరికలు నిజమయ్యాయని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ సంక్షోభాన్ని జాతీయ విద్యావిధానం 2020 తర్వాత విద్యలో జరిగిన విస్తృత మార్పుల నుంచి వేరుచేసి చూడలేం. ఇటీవల వచ్చిన విశ్లేషణలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. పరీక్షల కేంద్రీకరణ, కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి తగ్గించడం వంటి చర్యలు విద్యలో వైవిధ్యం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ, ప్రామాణీకరణ, అధికార కేంద్రీకరణను పెంచుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ కొత్త టాస్క్‌ఫోర్స్ లక్ష్యాలు పూర్తిగా విస్మరించిన మరో ముఖ్యమైన అంశం కోచింగ్ పరిశ్రమ. ప్రపంచంలోనే అతిపెద్ద కోచింగ్ మార్కెట్లలో భారత్ ఒకటి. ఇపుడు విజయం కేవలం ప్రతిభపై మాత్రమే ఆధారపడడం లేదు. ఖరీదైన కోచింగ్‌ను పొందే ఆర్థిక స్థోమతపై కూడా ఆధారపడుతున్నది. అనేక నగరాలు కోచింగ్ కేంద్రాలుగా మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించే కొత్త టాస్క్‌ఫోర్స్‌పై సందేహాలు కలుగడానికి మరో కారణం కూడా ఉన్నది. 2024లో జరిగిన నీట్ వివాదాల తర్వాత ప్రభుత్వం రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పరీక్షల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై అనేక సూచనలు చేసింది. కానీ వాటిలో చాలావరకు అమలు కాలేదు. అందువల్ల సమస్య కమిటీల కొరత కాదు. రాజకీయ సంకల్పం లేకపోవడమే అసలు సమస్య. గత కమిటీ సూచనలను అమలు చేయకుండా మరో కమిటీ వేయడమంటే ప్రజల ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లార్చే ప్రయత్నంగానే కనిపిస్తున్నది. భారతదేశానికి డిజిటల్ సంస్కరణలు మాత్రమే సరిపోవు. పరీక్షల కేంద్రీకరణను తగ్గించాలి. రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాలకు తగిన పాత్రను తిరిగి ఇవ్వాలి. ఒకే ప్రవేశపరీక్షపై ఆధారపడకుండా, ప్రవేశాలకు అనేక ప్రమాణాలను అమలు చేయాలి. కోచింగ్ పరిశ్రమను నియంత్రించాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. పరీక్షల నిర్వహణలో తప్పులు జరిగితే విద్యార్థులకు న్యాయం జరిగేలా చట్టబద్ధమైన జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సాంకేతికత ఒక పరీక్షను భద్రంగా నిర్వహిం చగలదు. కానీ న్యాయాన్ని అందించలేదు. ఒక మంత్రి రాజీనామా తక్షణ రాజకీయ ఒత్తిడిని తగ్గించవచ్చు. ఒక కొత్త టాస్క్‌ఫోర్స్ మరో నివేదిక ఇవ్వవచ్చు. మెరుగైన సైబర్ భద్రత ప్రశ్నాపత్రాల లీకులను కొంతవరకు అడ్డుకోవచ్చు. కానీ విద్యావ్యవస్థలోని అధిక కేంద్రీకరణ, వ్యాపారీకరణ, ప్రభుత్వ విద్య బలహీనపడడం వంటి మూల సమస్యలను పరిష్కరించకపోతే పరీక్షల సంక్షోభాలు మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. అందువల్ల భారతదేశం నిర్మించాల్సింది కేవలం మరింత భద్రమైన పరీక్షా వ్యవస్థ కాదు. మరింత ప్రజాస్వామ్యబద్ధమైన, సమానత్వంతో కూడిన విద్యావ్యవస్థ.

# క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ "క్షమాపణలు" చెప్పాలని, అంతేకానీ వారిని "క్షమించడం" కాదని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తమిళనాడులోని మామల్లపురంలో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. అనంతరం ఎక్స్‌లో పోస్ట్‌లో కేంద్రప్రభుత్వంపై, ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "కోల్పోయిన ప్రతి చిన్నారి ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని వేదనను మోస్తున్న ఒక కుటుంబం ఉంటుంది. అలాగే, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది. విద్యార్థులతో నిజాయతీగా ఉండని వ్యవస్థలో, మన విద్యార్థులను నిజాయతీగా చదవమని చెబుతున్నారు. అయినా, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడేంత ధైర్యం ప్రధానమంత్రికి ఉంది. బిడ్డలను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క తల్లి, తండ్రిని కూడా మోదీ కలవలేదు. లీక్ అయిన ప్రశ్నపత్రం వల్ల భవిష్యత్తు నాశనమైన ఒక్క విద్యార్థితో కూడా ఆయన కూర్చొని మాట్లాడలేదు."



మరోవైపు, తన సందేశంలో యువ నిరసనకారులు ఉపయోగించిన భాషపైనే మోదీ దృష్టి సారించారని, కానీ నిరసనకారుల పట్ల ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిని ప్రస్తావించడంలో విఫలమయ్యారని వామపక్ష విద్యార్థి సంఘం ఐసా పేర్కొంది. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న నిరసనకారులపై లాఠీలు, పెల్లెట్లు, బుల్లెట్లు ప్రయోగించడం, అలాగే అసమ్మతివాదులపై ఆన్‌లైన్ ట్రోలింగ్, డాక్సింగ్, బెదిరింపులే "అసలైన సాంస్కృతిక షాక్" అని అది ఆరోపించింది.

ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రధాని మోదీ శుక్రవారం మరో వీడియో పోస్ట్ చేశారు. అందులో ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏం జరిగిందో భారత్‌తోపాటు ప్రపంచ దేశాలన్నీ చూశాయని, కొంతమంది ఆకతాయి యువత దుర్భాషలాడటం, అసభ్యకరమైన పదాలు వాడటం, తనను, తన దివంగతురాలైన మాతృమూర్తిని కూడా దూషించారని పేర్కొన్నారు. అయితే, యవ్వనంలో ఇటువంటి తప్పులు సహజమని, దారి తప్పినవారిని సరైన మార్గంలో నడిపించడం మన కర్తవ్యమని మోదీ తెలిపారు. తనపై దుర్భాషలాడిన వాళ్లను శిక్షించడం, కోర్టు చుట్టు తిప్పడం వంటివాటితో పరిస్థితిలో మార్పు రాదని, అలా చేసిన వారిని క్షమిస్తున్నట్లు ఒక సందేశాన్ని పోస్టు చేశారు. తప్పుల నుంచి నేర్చుకుని ముందుకెళ్లాలని, దేశాభివృద్ధిలో కలిసి రావాలని యువతకు సూచించారు.

కాగా, దిల్లీ విద్యార్థుల నిరసన కార్యక్రమంలో మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదైన బాలికకు సంబంధించిన క్షమాపణ వీడియో ఒకటి వైరల్‌గా అయ్యింది. తన వ్యాఖ్యలపై తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ దేశ ప్రజలకు క్షమాపణ కోరింది. చేతులు జోడించి కనిపించిన ఆమె, నిరసన కార్యక్రమంలో కొందరి ప్రభావానికి లోనై ప్రధానిపై తీవ్ర వ్యాఖ్యలు చేశానని పేర్కొంది. నిరసన సమయంలో కొంతమంది చెప్పిన మాటలకు ప్రభావితమై ప్రధానమంత్రి గురించి చాలా తప్పుగా మాట్లాడానని తెలిపింది. తాను చేసిన పని క్షమించరానిదని, తన వల్ల పెద్ద తప్పు జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, అదే తన జీవితంలో మొదటి, చివరి తప్పు అని ఆమె స్పష్టం చేసింది. అలాగే, దేశ ప్రజలందరికీ చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నానని, తాను చేసిన పనికి చాలా సిగ్గుగా ఉందని,ఆ బాలిక వీడియోలో విజ్ఞప్తి చేసింది.

# కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా?

న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం చేసే సిఫారసులకు తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇంకా రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లీగల్ థింక్ టాంక్ 'విధి'కి చెందిన జీూాణ× ఇనిషియేటివ్ రూపొందించిన ఒక రిపోర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ అక్కడ జరిగిన ఒక చర్చలో కొలీజియం శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మూడు కొలీజియం తీర్మానాల్లో న్యాయమూర్తుల పదోన్నతులు, నియామకాలకు సంబంధించి కారణాల్ని వెల్లడించలేదని అన్నారు.



"గడిచిన 3 కొలీజియాల తీర్మానాలను నేను నిశితంగా గమనించా. అందులో నియామకాలకు సంబంధించి ఎలాంటి కారణాలూ వెల్లడించలేదు. ఇది పారదర్శకత సూత్రం నుంచి వెనక్కి తగ్గడం కాదా? కొలీజియం తీర్మానాలు ఇప్పుడు చూస్తుంటే ఒకే మూస పద్ధతిలో, కాపీ-పేస్ట్ చేసినట్లుగా కనిపిస్తున్నాయి."

**రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేసే వారికే చోటు!**

కారణాలు చెప్పకుండా రహస్యంగా నియామకాలు చేపట్టడం వల్ల అనర్హులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు. గతంలో ఒక హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒక వర్గం ప్రజల్ని ఉద్దేశించి 'చీమలు' అన్నారని, మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదంతాల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

**'ఎవరిని ఎందుకు సిఫార్సు చేస్తున్నామో తెలియాలి'**

కారణాలు దాచడం ద్వారా కొలీజియం అద్భుతంగా పనిచేసే నిజాయతీ గల జడ్జిలకు ద్రోహం చేయడమే కాకుండా, న్యాయ వ్యవస్థలోకి అనుచిత వ్యక్తులు వచ్చేందుకు స్థానం కల్పిస్తోంది. అటువంటి వారు రేపటి రోజున వ్యవస్థలోకి వచ్చి ఒక వర్గం ప్రజల్ని చీమలు అని సంబోధిస్తూ రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంది' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఉదహరించారు. న్యాయవ్యవస్థలోకి అలాంటి వ్యక్తులు రాకుండా అడ్డుకోవాలంటే, ఎవరిని ఎందుకు ఎంపిక చేస్తున్నామో, ఎందుకు తిరస్కరిస్తున్నామో తెలిపేలా సరైన చర్చలు జరగాలని, కారణాల్ని కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కనీసం సిఫార్సులకు కారణాలైనా వెల్లడించేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయం అసలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఇక్కడ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. అయితే 2024లో విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో పాల్గొన్న అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. అప్పుడు ఆ జడ్జి 'మన సంస్కృతిలో చిన్న చిన్న జంతువులకు కూడా హాని చేయకూడదని, చీమలను కూడా చంపకూడదని నేర్పుతారు. ఇది మనలో బలంగా నాటుకుపోయింది. కానీ మీ సంస్కృతిలో చిన్నప్పటి నుంచే జంతువుల వధను చూస్తారు. మీలో సహనం, కరుణ ఎలా ఆశించగలం' అంటూ వ్యాఖ్యానించగా, దీనిపై అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

**వివాదాలకు దారితీస్తున్న వ్యాఖ్యలు**

మరోవైపు ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ కూడా ఒక సందర్భంలో కొందరిని 'కాక్రోచ్ (బొద్దింకలు)' అని వర్ణించడం వివాదాస్పదమైంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో చీజుజు (నీట్ పరీక్ష) పేపర్ లీక్ అంశంపై పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన ఉద్యమం కూడా చెలరేగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా కూడా చేశారు. అయితే కొలీజియం వ్యవస్థలపై వచ్చే విమర్శలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గతంలో స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సుప్రీం కోర్టుకు లేదా హైకోర్టులకు న్యాయమూర్తుల్ని సిఫార్సు చేసే సమయంలో వారి పనితీరు, న్యాయమూర్తిగా అందించిన సుదీర్ఘ సేవలు, గతంలో వారు నిర్వహించిన బాధ్యతల్ని, వృత్తిపరమైన అనుభవం వంటి అనేక అంశాల్ని పరిశీలించిన తర్వాతే కొలీజియం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు.

# ఇథనాల్ కలపకపోతే పెట్రోల్ ధర
# లీటరుకు రూ.125 అయ్యేది!

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ దేశంలో పెట్రోల్ ధరలు అదుపులో ఉండేందుకు ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (జుధీూ) కార్యక్రమమే ప్రధాన కారణమని కేంద్రం స్పష్టం చేసింది. ఇథనాల్ మిశ్రమం అమలు చేయకపోయి ఉంటే దేశ రాజధాని దిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు ఏకంగా రూ. 125 కు చేరేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పేర్కొంది. మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, భారత క్రూడ్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు 135 డాలర్ల వరకు పెరిగిన సమయంలో కూడా దిల్లీలో వినియోగదారులు లీటర్ పెట్రోల్‌కు రూ. 94.77 మాత్రమే చెల్లించారు.




**ప్రజలకు లీటరుకు రూ. 30 వరకు ఆదా!**

ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకు దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను కాస్త తక్కువ ధరలకు, ముందస్తుగా నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయడం వల్ల అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల ప్రభావం తగ్గిందని పెట్రోలియం శాఖ వివరించింది. దీంతో ఆ సంక్షోభ సమయంలో కూడా వినియోగదారులకు లీటరుపైనే దాదాపుగా రూ. 30 వరకు ఆదా అయినట్లు తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యం రోజూ చౌకైన ఇంధనం అందించడం కాదని, ప్రపంచ చమురు మార్కెట్లో ఏర్పడే తీవ్రమైన ధరల ఒడుదొడుకుల నుంచి భారత వినియోగదారుల్ని రక్షించడం, దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు దోహదం చేయడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు సుమారు రూ. 1.97 లక్షల కోట్లకుపైగా విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందని కేంద్రం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా 316 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ముడి చమురు దిగుమతులకు ప్రత్యామ్నాయం లభించింది. ఇదే సమయంలో 950 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గినట్లు తెలిసింది.

**పన్ను చెల్లింపుదారుల డబ్బు కాదు- ఇదో ఎనర్జీ ఇన్సూరెన్స్!**

మరోవైపు ఇథనాల్ బ్లెండింగ్ పథకం టాక్స్ పేయర్ల సబ్సిడీలపై నడుస్తుందనే విమర్శల్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో నడిచే సబ్సిడీ కాదని, దేశ ఇంధన భద్రతకు రక్షణ కవచంలా పనిచేసే వ్యూహాత్మక కార్యక్రమం అని, ఎనర్జీ ఇన్సూరెన్స్ వంటిదని వెల్లడించింది. 'ఇది పన్నుల డబ్బుతో నడిచే సబ్సిడీ కానే కాదు. భారత ఇంధన భద్రతకు ఒక రక్షణ బీమా (ఎనర్జీ ఇన్సూరెన్స్) వంటిది. అంతర్జాతీయంగా తీవ్ర చమురు సంక్షోభం వచ్చినప్పుడు ఈ విధానం దేశాన్ని ఎలా కాపాడిందో ఇప్పటికే నిరూపితమైంది' అని తెలిపింది.

**తగ్గనున్న చమురు దిగుమతులు**

అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రైతులు, డిస్టిలరీలకు రూ. 1.66 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు (డైరెక్ట్ పేమెంట్స్) జరిగాయని కేంద్రం వెల్లడించింది. దీంతో వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంకా ప్రస్తుతం సుమారు 88 శాతంగా ఉన్న దేశ చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంలో ఇథనాల్ బ్లెండింగ్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాగే ప్రపంచ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగినా దేశీయంగా ఇంధన ధరల్ని నియంత్రించేందుకు ఈ కార్యక్రమం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపింది.

ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు చమురు విషయంలో దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్ వంటి పలు దేశాల్ని ఎలాంటి ఇబ్బందులకు గురిచేశాయో తెలిసిందే. ఇరాన్- అమెరికా యుద్ధం సమయంలో 2 నెలల కిందట ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 126 డాలర్ల వరకు పెరిగింది. అప్పుడు దేశీయంగా కూడా చమురు సంస్థలు చాలా కాలం తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల్ని 2-3 దఫాల్లో లీటరుపై రూ. 7 వరకు పెంచేశాయి. తర్వాత ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర తగ్గి ప్రస్తుతం 88 డాలర్లకు దిగొచ్చినా దేశీయంగా రిటైల్ ధరల్ని మళ్లీ తగ్గించలేదు. దిల్లీలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12 గా ఉండగా, డీజిల్ ధర రూ. 95.20 గా ఉంది. హైదరాబాద్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ రేట్లు లీటరుపై వరుసగా రూ. 115.73, రూ. 103.82 గా ఉన్నాయి.

## భూమిపై కురుస్తున్న అంతరిక్ష చెత్త..

అంతరిక్ష రంగంలో ప్రయోగాలు వేగవంతం అవుతున్న కొద్దీ, భూమికి కొత్త ముప్పు పొంచి ఉంది. ప్రతి వారం సుమారు ఒక మెట్రిక్ టన్ను (1000 కిలోలు) బరువున్న అంతరిక్ష శకలాల వర్షం భూమిపై కురుస్తోందని తాజా నివేదికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెరిగిపోతున్న రాకెట్ ప్రయోగాలు, వేల సంఖ్యలో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల కారణంగా ఈ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పోలెండ్ అంతరిక్ష సంస్థకు చెందిన నిపుణుడు మారియస్ స్లోనినా వెల్లడించిన వివరాల ప్రకారం, దాదాపు ప్రతిరోజూ అంతరిక్షం నుంచి ఏదో ఒక వస్తువు భూ వాతావరణంలోకి ప్రవేశిస్తోంది. ఇలా వారానికి సగటున ఒక టన్ను శకలాల చొప్పున భూమిని చేరుతున్నాయి. అమెరికా స్పేస్ ఫోర్స్ గణాంకాలు ఈ పెరుగుదలను స్పష్టంగా చూపుతున్నాయి. దశాబ్దం క్రితం ఏడాదికి సుమారు 110 వస్తువుల పునఃప్రవేశంపై హెచ్చరికలు జారీ చేస్తే, 2025 నాటికి ఆ సంఖ్య 820కి పెరిగింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా రాకెట్ ప్రయోగాలు జరగడమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా అంతరిక్ష శిథిలాల్లో అధిక భాగం భూ వాతావరణంలోకి ప్రవేశించగానే ఘర్షణకు గురై మండిపోతాయి. మిగిలినవి సముద్రాల్లో పడిపోతాయి. అయితే, కొన్నిసార్లు పెద్ద పరిమాణంలో ఉండే భాగాలు పూర్తిగా కాలిపోకుండా భూమిపై పడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కెన్యాలోని ముకుకు గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలో 16 ఏళ్ల క్రితం ప్రయోగించిన రాకెట్‌కు చెందిన భారీ లోహపు రింగ్ ఒకటి కూలిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి విడివడిన ఒక శిథిలం అమెరికాలోని ఫ్లోరిడాలో ఒక ఇంటిపై పడింది. పోలెండ్‌లో స్పేస్‌ఎక్స్ రాకెట్‌కు చెందిన భాగాలు, స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో చైనాకు చెందిన పాత ఉపగ్రహ శకలాలు, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. అంతరిక్ష శిథిలాల వల్ల ఒక వ్యక్తి గాయపడే అవకాశం, పిడుగు పడే సంభావ్యత కంటే చాలా తక్కువ అని నిపుణులు చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం క్రమంగా పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. 2035 నాటికి కేవలం స్పేస్‌ఎక్స్ ఉపగ్రహాల శిథిలాల వల్ల ప్రతి రెండేళ్లకు ఒకరు గాయపడటం లేదా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం అంచనా వేసింది. ఈ ముప్పును నియంత్రించడానికి స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రూపొందించిన ఐక్యరాజ్యసమితి ఒప్పందాలు నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. 2007లో జారీ చేసిన మార్గదర్శకాలకు చట్టబద్ధత లేదు. అనియంత్రిత శిథిలాలు ఎక్కడ పడతాయో కచ్చితంగా అంచనా వేయడం కూడా చాలా కష్టం. కేవలం ఒక్క నిమిషం అంచనా తప్పినా, శిథిలాలు పడే ప్రదేశం దాదాపు 300 మైళ్ల వరకు మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో, శిథిలాలు పూర్తిగా కాలిపోయేలా వస్తువులను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నా, దానిని తప్పనిసరి చేసే చట్టాలు లేవు. సాంకేతికత వేగంగా ముందుకు వెళ్తున్నా, దానివల్ల తలెత్తే పర్యవసానాలను ఎదుర్కోవడానికి అవసరమైన నియంత్రణ వ్యవస్థలు వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

## నీట్ యూజీ 2026:
## ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం



నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది. నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్ట్రే వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది



వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు. భారతీయ సంప్రదాయంలో వివాద పరిష్కారానికి తొలుత కుటుంబం (కుల), తర్వాత వర్గం (శ్రేణి), ఆపై సభ (పుగ) వద్దకు వెళ్లేవారని, ఇవన్నీ విఫలమైనప్పుడే రాజును ఆశ్రయించేవారని తెలిపారు. అంటే ఏ సమస్యకైనా మొదటి అడుగు ఎప్పుడూ సంప్రదింపులేనని ఆయన వివరించారు. ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక పరిష్కారం కుదర్చడమే తన న్యాయవాద వృత్తిలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధం కావడానికి ముందే భారతీయుల రక్తంలో ప్రవహిస్తోందని, అది మన సంస్కృతిలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో వివరించారు.

# మాతా, శిశు ఆరోగ్య సంరక్షణకు సుజనా ఫౌండేషన్ ముందడుగు

**రాష్ట్రంలోనే తొలి ఉచిత 2డీ ఎకో స్కానింగ్ కేంద్రం ప్రారంభం**

**గర్భిణీలకు ఉచిత అత్యాధునిక గుండె పరీక్షలు**




విజయవాడ, మహానగర్

గర్భిణీలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందడుగుగా పశ్చిమ నియోజకవర్గంలో రాష్ట్రంలోనే తొలి ఉచిత 2డీ ఎకో స్కానింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) శనివారం ప్రారంభించారు. సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా తొలి విడతలో సుమారు 550 మంది గర్భిణీలకు ఉచితంగా అత్యాధునిక గుండె పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, గర్భధారణ సమయంలో తల్లి, గర్భస్థ శిశువులో గుండె సంబంధిత లోపాలను ముందుగానే గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య చికిత్స అందించి మాతా, శిశు మరణాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి గర్భిణీకి అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభ రోజునే ఈ సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతలేనని, అయితే సామాజిక బాధ్యతతో సేవా సంస్థలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత ప్రతి ప్రజాప్రతినిధి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమానంగా సేవ చేయాల్సిన బాధ్యత ఉందని, పేద--ధనిక అనే తేడా లేకుండా అన్ని గర్భిణీలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని ప్రజారోగ్యం, సంక్షేమం, వినూత్న సేవల్లో రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉండే 2డీ ఎకో స్కానింగ్ సేవలను ఉచితంగా ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. గర్భస్థ శిశువులో లోపాలను ముందుగానే గుర్తించి మాతా, శిశు మరణాల తగ్గింపులో ఈ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ నమూనాను జిల్లాలోని ఇతర నియోజకవర్గాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించేలా సుజనా ఫౌండేషన్ సహకరించాలని కోరారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ మహిళలు, గర్భిణీలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి సేవాతత్పరత అభినందనీయమన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా సుజనా ఫౌండేషన్ అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్, ఏపీ నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఏపీ నాగవంశం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆశా, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, బాడిత శంకర్, తిరుపతి అనూష, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, కోగంటి రామారావు, బీజేపీ నాయకులు పోతిన భేష కంటేశ్వరుడు, దుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సుజనా ఫౌండేషన్ సీఈఓ సుధా ఉపాధ్యాయ్, గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గోదావరి

-మొదటిపేజీ తరువాయి

నీరు వస్తుండగా ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కులకు చేరనుందని, రెండో ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి సుమారు 11.46 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే కొట్టుకుపోవడంతో లంక గ్రామాల వాసులు బోట్లు ఎక్కి ప్రయాణం సాగిస్తున్నారు. తూర్పుగోదావరి, కోనసీమ, పోలవరం జిల్లాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, వారికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ శిబిరాలు సైతం సిద్ధం చేస్తున్నారు.



**లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు:** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 17 మండలాలు, 32 లంకగ్రామాలకు వరదముప్పు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ముందస్తుగా సహాయక చర్యలకు సిద్ధమవుతున్నారు. వరద దృష్ట్యా జిల్లాలో సిబ్బంది, అధికారులకు సెలవులను కలెక్టర్ రద్దు చేశారు. బ్యారేజ్ నుంచి దిగువన ఉన్న గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. బ్యారేజ్‌కు దిగువున ఉన్న లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు.

లంక గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించి అధికారులకు వరద హెచ్చరికలపై దిశానిర్దేశం చేశారు. పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో వరద రేవు పరిస్థితిని అధికారులు అంచనా వేశారు. విద్యార్థులు, గర్భిణీలు, వృద్ధులు ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోనసీమలో వివిధ నదీపాయల్లో తాత్కాలిక బాటలు తెగిపోయాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిధిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.

**భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ:** తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపు దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రవాహం పోటెత్తుంది. గోదావరి నీటిమట్టం 54.8 అడుగుల చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరిలో 14.26 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పోటెత్తుతున్న వరదతో స్నానఘట్టాలు, కళ్యాణకట్ట, విద్యుత్ స్తంభాలు మునిగిపోయాయి.

వరద ఉద్ధృతితో పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్లలోని తూరుబాక వద్ద రోడ్డు పైకి నీరు చేరింది. వరద నీటితో చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు 43 అడుగుల వద్దకు చేరుకోగా అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం 55 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో రాజమహేంద్రవరం వద్ద ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు.

గోదావరి నీటిమట్టం పెరుగుతున్నందు వల్ల ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అధికారులు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు.

కోనసీమ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ - 08856 - 293104

అమలాపురం కంట్రోల్ రూమ్ - 08856 - 233208

రామచంద్రపురం కంట్రోల్ రూమ్ - 08857 - 245166

కొత్తపేట కంట్రోల్ రూమ్ - 85002 - 38258, 08855 - 244299

## వీర మహిళలకు పెద్ద పీట....

కాకినాడ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం స్పందించాలి

**పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డీఏల విడుదల చేయాలి**

**ఏపీ జేఏసీ డిమాండ్**




విజయవాడ, మహానగర్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే చొరవ చూపాలని ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ కోరారు. శనివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో నిర్వహించిన ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ, వేతన సవరణ జరిగి ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటికీ కొత్త పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర నిరాశకు కారణమైందన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఒకటో తేదీన వేతనాల చెల్లింపు, బకాయిల చెల్లింపులో కొంత పురోగతి కనిపించినప్పటికీ, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఇంకా అందడం లేదని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికే మంత్రుల కమిటీతో సమావేశం నిర్వహించిందని, ముఖ్యమంత్రితో మరో సమావేశం అనంతరం సానుకూల నిర్ణయాలు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో పీఆర్సీ ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోందని, అక్కడ మధ్యంతర భృతి ప్రకటించడంతో పాటు వేతన సవరణ తుది దశకు చేరుకుందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇకపై జాప్యం చేయకుండా పీఆర్సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించడం ద్వారా ఉద్యోగులకు భరోసా కల్పించాలని కోరారు. ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మంత్రివర్గ బృందంతో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి రాష్ట్రస్థాయి జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ ఎన్జీవోస్, పెన్షనర్స్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పబ్లిక్ సెక్టార్, పీఆర్‌టీయూ, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ నర్సులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, రవాణా, ట్రెజరీ, ఇరిగేషన్, కమర్షియల్ టాక్సెస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రంగంలోకి రోజా



తిరుపతి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త పరిణామం పార్టీ శ్రేణులకు గందరగోళపరుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక కుదుపు. మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ యాక్టివ్ కావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఆమెను పక్కనపెట్టి బీసీ నేతకు అవకాశం ఇస్తారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. ఈ విషయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. నగిరి నియోజకవర్గంలో రోజా అభ్యర్థిత్వం మార్పు చేయాలని ఆయన కోరుతూ వచ్చారు. ఎందుకంటే రోజా ఉంటే పెద్దిరెడ్డికి ఇబ్బందికరమే. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీనియర్ మంత్రిగా పెద్దిరెడ్డి ఉంటారు. అదే జిల్లాలో రోజా మంత్రిగా ఉంటే తనకు ఇబ్బందికరమని పెద్దిరెడ్డికి తెలుసు. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు పెద్దిరెడ్డి. కానీ జగన్ చివరి నిమిషంలో ఆమెకు చాన్స్ ఇచ్చారు. ఈసారి ఆమెను తప్పిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ ఇప్పుడు రోజాను మళ్ళీ తెరపైకి తేవడంతో పెద్దిరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది.ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దానికి కారణం లేకపోలేదు. జగన్ స్థాయిలో పెద్దిరెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే ఇంతవరకు జగన్మోహన్ రెడ్డిని టచ్ చేయలేదు కానీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు మద్యం కుంభకోణంలో. అయితే ఈ పరిణామాలతో తీవ్ర కలత చెందారు పెద్దిరెడ్డి. మరోవైపు మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కనీసం జగన్మోహన్ రెడ్డి పరామర్శించిన దాఖలాలు లేవు. అప్పటినుంచి ఏర్పడిన గ్యాప్ అలానే విస్తరించింది. ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అటవీ భూముల వ్యవహారం, ఆపై రెవెన్యూ రికార్డుల దహనం కేసు వెంటాడుతోంది. ఇన్ని అవమానాలు పడి జగన్మోహన్ రెడ్డి కోసం పార్టీలో ఉండాలా.. ఆపై తన ప్రత్యర్థి రోజాను ప్రోత్సహించడం ఎంత మాత్రం మింగుడు పడడం లేదు పెద్దిరెడ్డికి. అందుకే బిజెపిలోకి వెళ్లిపోవాలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు రోజా. ఆమెకు నగిరి టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ వెనుకడుగు వేస్తున్నారు అన్న ప్రచారం నేపథ్యంలోనే ఆమె చెన్నైలో ఉండిపోయారన్న టాక్ నడిచింది.. క్రమేపీ ఆమె వైసీపీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఉన్నట్టుండి ఆమెను తిరిగి చిత్తూరు రాజకీయాల్లోకి తేవడం.. మరింత స్వేచ్ఛ ఇవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. పెద్దిరెడ్డి పై ప్రోత్సహించేందుకే జగన్ ఆమెను తీసుకొచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ బిజెపిలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వెళితే రోజా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా చిత్తూరు జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చూస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## బిజినెస్

### యాపిల్ యాప్ స్టోర్ ఇండియా హెడ్‌పై కేసు



**హైదరాబాద్:** ట్రేడింగ్ స్కామ్‌లో రూ. 12.7 లక్షలు కోల్పోయిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు యాపిల్ యాప్ స్టోర్స్ ఇండియా హెడ్‌ను నిందితుడిగా చేర్చారు. సోమాజీగూడకు చెందిన బాధితుడు ఇన్‌స్ట్రాగామ్ ద్వారా జే--బారా మొబైల్ ట్రేడింగ్ యాప్ ప్రకటనకు ఆకర్షితుడై యాప్ ప్రతినిధిగా చెప్పుకున్న సోనల్ జగన్నాథ్ నాయక్‌ను ఫోన్లో సంప్రదించాడు. యాప్ స్టోర్‌కు సంబంధించిన ఓ లింకును వాట్సాప్ ద్వారా పంపిన నాయక్.. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలని బాధితుడికి సూచించాడు. అలాగే జూలియస్ బేర్ దలాల్ వ్యూ పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులోనూ బాధితుడిని చేర్చాడు. దాని అడ్మిన్‌గా ఉన్న కునాల్ సుమయ అనే మహిళ బాధితుడికి పెట్టుబడులపై సలహాలు ఇచ్చింది. దీంతో బాధితుడు దశలవారీగా మొత్తం రూ. 12.7 లక్షలు పెట్టుబడి పెట్టగా యాప్‌లో ఆయన పెట్టుబడి విలువ రూ. 25.42 లక్షలకు పెరిగినట్లు చూపింది. కానీ పెట్టుబడి లక్ష్యాన్ని చేరుకోలేదంటూ ఆ ట్రేడింగ్ ఖాతాను నిందితులు బ్లాక్ చేశారు. ఆ తర్వాత కునాల్ సుమయ సహాయకురాలినని చెప్పుకున్న సోనాల్ జగన్నాథ్ నాయక్ అనే వ్యక్తి.. తాము డిమాండ్ చేసిన మొత్తం చెల్లించాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గుర్తించాడు. వెంటనే సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇందులో యాపిల్ ప్లే స్టోర్ పైనా ఆరోపణలు చేశారు. సదరు ట్రేడింగ్ యాప్ అందులో ఉన్నందునే తాను నమ్మానని పేర్కొన్నాడు. దీంతో యాపిల్ స్టోర్ హెడ్‌ను సైతం పోలీసులు నిందితుడిగా చేర్చారు. మరోవైపు రూ. 29.,25 లక్షలు కోల్పోయి ఖైరతాబాద్‌కు చెందిన ఓ సేల్స్‌మన్ ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైన మరో కేసులోనూ జగన్నాథ్ నాయక్, కునాల్ నిందితులుగా ఉన్నారు.

### జులైలో రికార్డు స్థాయిలో యూపీఐ లావాదేవీలు

**ఇంటర్నెట్ డెస్క్:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు సరికొత్త రికార్డు సృష్టించాయి ఈ ఏడాది జులైలో రూ.29.88 లక్షల కోట్లు విలువ చేసే 23.66 బిలియన్ లావాదేవీలు జరిగాయి. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 22 శాతం పెరగగా, విలువ పరంగా 19 శాతం పెరిగాయి. జులైలో రోజుకు సగటున రూ.96,383 కోట్లు విలువ చేసే 76.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. పెద్ద నగరాలు దాటి చిన్న పట్టణాలకు, గ్రామీణ ప్రాంతాలకు యూపీఐ సేవలు విస్తరించడమే ఇందుకు కారణంగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులు, రీఛార్జ్‌ల కోసం ప్రతిరోజూ నగదుకు బదులుగా డిజిటల్ లావాదేవీలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

## జూలైలో రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ కలెక్షన్లు..

# 15.4 శాతం పెరుగుదల

జూలై నెలకు సంబంధించిన గూడ్స్ అండ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) వసూళ్ల వివరాలు వెల్లడించింది కేంద్రం. జూలైలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) వసూళ్లు రూ.39,835 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు రూ.47,881 కోట్లుకాగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1.23 లక్షలుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది ఇదే నెలకు సంబంధించి జీఎస్టీ వసూళ్లలో 15.4 శాతం పెరుగుదల ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కావడం ఇది రెండోసారి. చివరగా గత ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ వివరాల్ని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం, ఆగష్టు 1న విడుదల చేసింది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది. దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించింది.




## జియో రీఛార్జ్: రూ.198 ప్లాన్.. రోజుకి 2జీబీ డేటా!

ప్రముఖ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో తన యూజర్ల కోసం అందిస్తున్న సరసమైన రీఛార్జ్ ప్లాన్లలో రూ.198 కూడా ఒకటి. ఈ ప్లాన్ ద్వారా లభించే డేటా ఎంత, వ్యాలిడిటీ, ఇతర ప్రయోజనాల గురించి మరిన్ని వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. రూ.198 రీఛార్జ్ ప్లాన్ ద్వారా రోజుకు 2జీబీ డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లు పొందవచ్చు. అయితే వ్యాలిడిటీ మాత్రం 14 రోజులు మాత్రమే. కాగా జియోటీవీ, జియోసినిమా, జియోక్లౌడ్ వంటి ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌లు లభిస్తాయి. తక్కువ ధరలో రీఛార్జ్ కావాలనుకునే వారికి ఈ ప్లాన్ మంచి ఎంపిక అవుతుంది.

**రూ.55కే 1000పైగా ఛానళ్లు!**

జియో తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం కేవలం రూ.55కే ఒక ప్రత్యేక టీవీ వోచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ ద్వారా తక్కువ ధరలోనే ప్రీమియం లైవ్ టీవీ ఛానళ్లను చూడవచ్చు. రూ.55 ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. అయితే దీని ద్వారా 10ఎంబీ డేటా మాత్రమే లభిస్తుంది. డేటా పరంగా పెద్దగా ఉపయోగం లేకపోయినప్పటికీ.. టీవీ ఛానల్స్ చూడటానికి పనికొస్తుంది. జియోటీవీ యాప్‌లో 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించవచ్చు. ఇందులో జియోస్టార్, సోనీ ఎంటర్‌టైన్‌మెంట్, సన్ టీవీ నెట్‌వర్క్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, ఈటీవీ వంటి ప్రముఖ నెట్‌వర్క్‌లకు చెందిన ఛానల్స్ అందుబాటులో ఉంటాయి. తక్కువ ఖర్చుతో మొబైల్‌లో లైవ్ టీవీ చూడాలనుకునే జియో వినియోగదారులకు ఈ రూ.55 ప్లాన్ మంచి ఎంపిక.



## ఆగస్టు 4న శ్రీలంకకు టీమిండియా..

# ప్రాక్టీస్ మ్యాచ్ షెడ్యూల్ కుదింపు!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు సిద్ధమవుతోంది టీమిండియా. రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల కాస్త మూడు రోజులకు మారింది. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది. శ్రీలంక పర్యటనకు భారత స్క్వాడ్ ప్రకటన సమయంలోనే నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. అయితే.. ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేశామని, ప్రాక్టీస్ మ్యాచ్ మూడు రోజులకే పరిమితం కానుందని సమాచారం. షెడ్యూల్ ఎందుకు మారింది? అనేది మాత్రం తెలియడం లేదు. శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతం గంభీర్ బృందం ఆగస్టు 4న శ్రీలంకకు వెళ్లనుంది. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ అనంతరం తొలి టెస్టుకోసం భారత జట్టు గాలే చేరుకోనుంది. ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసవ్వడం భారత పేస్ బలాన్ని పెంచనుంది. అయితే.. గాయం నుంచి కోలుకుంటున్న సాయి సుదర్శన్ ఈ టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. భారత టెస్టు స్క్వాడ్ : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.




### పారా షాట్‌పుట్‌లో సోనమ్‌కు స్వర్ణం..
### రజతంతో మురిసిన శుభమ్..!

కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేటలో దూసుకెళ్తున్నారు. పారా షాట్‌పుట్‌లో సోనమ్ రానా శుభమ్ జుయల్ లు తొలి రెండు స్థానాల్లో నిలిచి పసిడి, రజత పతకాలు సాధించారు. శనివారం జరిగిన పురుషుల ఎఫ్ 57 ఫైనల్లో సోనమ్ ఇనుపగుండును ఏకంగా 13.40 మీటర్ల దూరం విసిరి స్వర్ణం గెలుపొందాడు. అతడిని అనుసరించిన శుభమ్ 13.28 మీటర్లతో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. పదోరోజును బాక్సర్లు ప్రీతి పవార్ జాస్మినెలు స్వర్ణం ప్రారంభించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ సెల్వ ప్రభు తిరుమరన్ లు రజతం, కాంస్యం సాధించారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్ బాక్సర్ జై డిక్సన్ 55 కిలోల విభాగంలో రజతంతో సరిపెట్టుకున్నాడు. వీరి స్ఫూర్తితో పారా అథ్లెట్లు సైతం పతకాలు కొల్లగొట్టారు. హోరాహోరీగా సాగిన పారా షాట్‌పుట్ ఫైనల్లో అదరగొట్టిన సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు స్వర్ణ, రజత పతకాలను ఒడిసిపట్టారు. సోనమ్ 13.40 మీటర్లు, శుభమ్ 13.28 మీటర్ల దూరం ఇనుపగుండును విసిరి ప్రథమ, ద్వితీయా స్థానాల్లో నిలిచారు. వీరి కంటే ముందే.. పారా షాట్‌పుట్ మహిళల విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్కర్ దేశానికి మొట్టమొదటి పసిడి అందించిన విషయం తెలిసిందే. కామన్వెల్త్ పారా షాట్‌పుట్‌లో.. 20 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత అథ్లెట్ల కలను సాకారం చేసింది షర్మిల.




## స్పోర్ట్స్

### ట్రిపుల్ జంపులో డబుల్ బొనాంజా..
### డెకాథ్లాన్‌లో తొలి పతకం..!



కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో మెరిసిన ప్రవీణ్ చిత్రవేల్ సెల్వ ప్రభు తిరుమరన్‌లు ఫైనల్లోనూ సత్తా చాటి పతకాలు సాధించారు. శనివారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరం దూకి వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్ పోడియం మీద ఈ ముగ్గురూ సగర్వంగా పతకాలు స్వీకరించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు పదో రోజు కూడా పతకాల వేట కొనసాగించారు. బాక్సర్లు ప్రీతి పవర్, జాస్మినె లంబోరియాలు స్వర్ణాలు అందించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు కాంస్యంతో మెరిశారు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో ప్రవీణ్ ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరంతో వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మొదట 16.05 మీటర్లు దూకిన ప్రవీణ్.. నాలుగో ప్రయత్నంలో 16.58 మీటర్ల మార్క్ అందుకున్నాడు. సెల్వ సైతం 15.87 మీటర్ల నుంచి.. నాలుగో ప్రయత్నంలో 16.52 మీటర్ల దూరంతో కాంస్యం గెలిచాడు.

**7,976 పాయింట్లు**

ఇక పది క్రీడల డెకాథ్లాన్ పోటీల్లో తేజస్విన్ శంకర్ దేశానికి మొట్టమొదటి పతకం అందించాడు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, 400 మీటర్లు, జావెలిన్ త్రో, పోల్ వాల్ట్, 1500 మీటర్ల పరుగులో సత్తా చాటిన తేజస్విన్ 7,976 పాయింట్లు సాధించి, కాంస్యంతో యావత్ దేశం గర్వపడేలా చేశాడు. గాయం బాధించినా సరే దేశం కోసం పతకం గెలవాలనే కసితో పోటీపడిన తేజస్వీపై ప్రశంసలు కురుస్తున్నాయి.




# అనుపమ, తరుణ్ భాస్కర్‌ల 'క్రేజీ కళ్యాణం' టీజర్ రిలీజ్!

యువ నటి అనుపమ పరమేశ్వరన్, నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'. అఖిల్ రాజ్, సీనియర్ నటుడు నరేష్ వీకే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తుండగా, బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చి సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంటోంది. పెళ్లి వేడుకల నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన సంఘటనలతో, పూర్తిగా నవ్వులు పంచే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు తీర్చిదిద్దినట్లు టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. పెళ్లి అనగానే వచ్చే సందడి, ఆ వెనుక జరిగే సరదా గొడవలు, అనుపమ మరియు తరుణ్ భాస్కర్ ల మధ్య వచ్చే కామిక్ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నరేష్ వీకే మరియు అఖిల్ రాజ్ పాత్రలు ఈ కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాలోని వినోదాత్మక సన్నివేశాలకు తగ్గట్టుగానే ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. టీజర్ లోని ప్రతీ డైలాగ్ మరియు విజువల్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ తో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

## మహేష్ బర్త్‌డే కౌంట్‌డౌన్ మొదలు..

**'వారణాసి' నుంచి స్పెషల్ ట్రీట్ ఉంటుందా, ఫ్యాన్స్‌లో ఉత్కంఠ!**

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని? దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. 'ఆర్ఆర్ఆర్' వంటి ప్రపంచవ్యాప్త విజయానంతరం రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.అయితే ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈసారి కూడా ఫస్ట్ లుక్, పోస్టర్ లేదా చిన్న గ్లింప్స్ విడుదల చేస్తారా? లేక మరికొంత సమయం వేచి చూడాలని చెబుతారా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది.ఈ చిత్రంలో ప్రముఖ నటి ప్రియాంక చోప్రా కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ వేదికలపై ఆమె ఈ సినిమా గురించి, రాజమౌళి విజన్ గురించి ప్రస్తావిస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. దీంతో 'వారణాసి'పై గ్లోబల్ మార్కెట్‌లో కూడా మంచి బజ్ ఏర్పడుతోంది.





## 'చైనా పీస్' కాదు ఇకపై 'సీక్రెట్ సోల్జర్'.. రిలీజ్‌కి రెడీ

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో తీసిన యూనిక్ స్పై డ్రామా సినిమా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. టీజర్ అంచనాలను మరింత పెంచింది. ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం.. ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్'గా ప్రేక్షకుల ముందుకు రానుంది. సెన్సార్ బోర్డ్.. యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్‌గా పనిచేశారు. కమల్ కామరాజు, తులసి, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఇతర పాత్రలు చేశారు.

## 'టాక్సిక్' ట్రైలర్ డేట్ ఫిక్స్.. బాక్సాఫీస్ పై యష్ సునామీ!

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8, 2026 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.






## 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ అదిరింది..

**డ్యూయల్ షేడ్స్, కామెడీతో అంచనాలు పెంచిన వరుణ్**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999